# చిరిగిన పేజీలు

ఒకటో తారీకు. ఆకాశవాణి నించి పనిమనిషిదాకా ఆ విషయం బాకా ఊదారు. కాలెండరు మాత్రం ఇంకా ముప్పయి ఒకటో తారీకే చూపిస్తోంది. "నువ్వింకా గతానికి చెందిన వాడివే"నని అది ఎత్తిపొడుస్తున్నట్టనిపించింది. వెంటనే బద్ధకం వదిలించుకుని పేజీ చింపేశాడు. ఉమాపతి కళ్ళముందు మెదిలాడు. ఎప్పుడు క్యాలండరు పేజీ చింపివేస్తున్నా నాకు ఉమాపతి జ్ఞప్తికి వస్తాడు.

ఉమాపతీ, నేనూ ప్రాణస్నేహితులం కాకపోయినా, ఒకరితో ఒకరికి మంచి దోస్తీ ఉంది. చదువు ముగిసిన తరువాత చెరొక దారీ ఐనా, సవంత్సరానికోసారి ఇద్దరమూ కలుసుకునే అవకాశం ఇప్పటివరకూ కలుగుతూనే ఉంది. మా ఇద్దరికీ అభిరుచుల్లో తేడా ఉంది. అభిప్రాయాల్లో భేదాలున్నాయి. అంతస్తుల్లోనూ అంతరం వుంది. అతను బాగా డబ్బున్నవాడు. అందువల్ల అతనిమీద నాకు కొంత ఈర్ష్యఉంది. అతనికిలేని డిగ్రీ నాకుంది. ఆ కారణంవల్ల అతనికి నామీద కొంత ఈర్ష్య ఉందని అతను నవ్వుతూ చాలాసార్లు అన్నాడు. అతనిమీద నాకు చాలాసార్లు జాలికలిగింది. "నిన్ను చూస్తే జాలి వేస్తోందోయ్" అని అతనూ నాతో చాలా సార్లు చెప్పాడు. నావిషయం అలా ఉంచండి.

ఇప్పుడు చెప్పవలసింది ఉమాపతి విషయం. నాకు ఉమాపతితో స్కూల్ ఫైనల్ చదువుతున్నప్పుడు పరిచయమైంది. అతను మా సెక్షన్ కాదు. కాని అతన్ని క్రింది క్లాసుల్నుంచీ నేను ఎరుగుదును. మంచి విగ్రహపుష్టి కలవాడు. బూటులేంది క్లాసుకి వచ్చేవాడు కాదు. ఎప్పుడూ సిల్కుల్లోనే

Mirzalguda, Secunderabad



హాజరు. ఆటలుకూడా బాగా ఆడేవాడు. అతనితో పరిచయం చేసుకోవాలని నాకు చాలాసార్లు అనిపించింది. అతను స్నేహితుడైతే అది గర్వ కారణమని అనుకొనే వాడిని. ఐతే స్నేహం లేకపోగా విరోధం కొని తెచ్చుకున్నానని భయపడే అగత్యం ఓ సారి కలిగింది. టోర్నమెంట్ సెలక్షన్‌కి స్కూల్లో చెడుగుడు ఆడుతున్నాం. నేనూ, ఉమాపతీ ఎదురెదురు. నేను ఆతన్ని అవలీలగా రెండుసార్లు యలమీదే పట్టేశాను. ఆతని ముఖం కందగడ్డయింది. నావైపు ఉరిమి ఉరిమి చూడసాగాడు. నాకు భయమూ, సంతోషమూకూడ కలిగాయి. ఇహ ఆతనితో స్నేహం కల్ల అనుకున్నాను. అయితే మర్నాడు బాడ్మింటన్ మాచ్‌లో అతను కొట్టిన బంతిని తియ్యబోయి మూడుసార్లు పల్టీకొట్టి అతని [illegible]చూసి నవ్వేసరికి మాచ్ కాగానే వచ్చి కావలించుకున్నాడు. "నీకు మంచి స్పోర్ట్సుమన్‌షిప్ స్పిరిట్ ఉందోయ్, నేనైతే నీకాళ్ళమీదికి బ్యాట్ విసిరేద్దును" అన్నాడు. అదీ మా స్నేహానికి నాంది. ఆ సాయంత్రం ఇద్దరం కలిసి ఇంటికి బయల్దేరాం. అతని ఖర్చుమీద సోడా తాగాను. మర్నాడు ఇద్దకలిసి స్కూల్‌కి వెళ్ళాలని సంకల్పించుకున్నాం. నేను వాళ్ళఇంటికి కొంచెం ముందుగావచ్చి కేకవేయాలని ఒప్పందం.

మాటప్రకారం మర్నాడు ఉమాపతిని పిలిచాను. అతను అప్పుడే భోజనం చేసి చెయ్యి తుడుచుకుంటూ అలాగే బయటికి వచ్చి నన్నుచూసి సంతోషంగా ఇంట్లోకి తీసుకువెళ్ళాడు. "ఆ వచ్చిందెవర్రా?" అని వాళ్ళఅమ్మ కాబోలు అడిగితే "మా ఫ్రెండ్‌లే" అని జవాబిచ్చాడు. నాకు బలేగర్వం వేసింది. హాల్లోంచి ఒక గదిలోకి తీసుకువెళ్ళి కుర్చీలో కూర్చోమని అతను స్కూలు బట్టలు వేసుకోటం ప్రారంభించాడు. ఆ గదిచూసి నేను ఆశ్చర్యపోయాను. చాలా శుభ్రంగావుంది. మూడు కుర్చీలు, ఒక టేబుల్ వున్నాయి. టేబుల్‌మీద మంచి డిజైన్‌గల క్లాత్, పుస్తకాలు పెట్టుకునే

చిన్న రాక్ వున్నాయి. టేబుల్ వారగావున్న గోడమీద "శ్రీరామ పట్టాభి షేకం" పటంవుంది.

ఆగది ఉమాపతికి ప్రత్యేకంఅట. ఎవరూ వచ్చి డిస్టర్బ్ చెయ్యరుట. అలాంటి గది వుంటే నేనింకా ఎంత శ్రద్ధగా చదువుకునే వాడినో అనిపించింది. నేనలా బిత్తరచూపులు చూస్తుంటే "నీకు చదువుకోటానికి ప్రత్యేకంగా గది లేదా?" అని అతను కొంచెం గర్వాతిశయంతో అడిగాడు. నేను లేదన్నట్టు తల తిప్పాను. "అరె!" అని అతను జాలి వెలిబుచ్చాడు. మరి కొంత సేపట్లో అతని అలంకరణ పూర్తయింది. పుస్తకాలు తీసుకున్నాడు. ఇంక వెళ్ళటానికి నేను లేవగానే "ఒక్క నిముషం ఆగు" అని ఉమాపతి అత్యంత వినయ వినమితగాత్రుడై "శ్రీరామ పట్టాభిషేకం' పటానికి మనఃపూర్వకంగా నమస్కరించాడు. ఆ దృశ్యం నన్ను ఆశ్చర్య చకితుడిని జేసింది. ఉమాపతికి అంత భక్తివుందని నే నెప్పుడూ అనుకోలేదు.

"నువ్వు నమస్కారం చెయ్యవా ?" అన్నాడు ఉమాపతి నమస్కారానంతరం.

"ఎందుకు ?" అప్రయత్నంగా అన్నాను.

అతని వదనంలో కొంత ఆశ్చర్యం ద్యోతకమైంది. సమాధానం చెప్పకుండా "సరే పద. నీ కలవాటు లేదల్లేవుంది," అని ముందుకు నడిచాడు. నేను మారుమాట్లాడకుండా అతన్ని అనుసరించాను.

ఉమాపతి తర్వాత చెప్పాడు. స్కూల్‌కి వెళ్ళేముందూ, స్కూల్‌నించి రాగానే రాములవారికి నమస్కారం చెయ్యటం అతని కలవాటుట. భగవంతుడి అనుగ్రహం వుంటే తప్పక పరీక్ష ప్యాస్ అవుతాడనీ, ఆ అనుగ్రహంకోసం ప్రార్థిస్తూ భక్తిపూర్వకంగా వందనం అర్పిస్తున్నాడనీ

చెప్పాడు. "అలా చెయ్యమని నాకెవరూ చెప్పలేదే" అని అక్షణంలో నేను విచారించాను.

ఉమాపతి "శ్రీరాఘవం-" మొదలైన శ్లోకాలు వచ్చుననీ, అవి నిత్యం పఠిస్తుంటాడనీ, పరీక్ష పేపర్లమీద సైతం "శ్రీరాములవారి సహాయం కావలెను" అని రాస్తుంటాడనీ మరికొన్ని రోజుల్లోనే నేను తెలుసుకున్నాను. మా స్నేహం కొంచెం దృఢతరంకాగానే శ్లోకాలు నన్నూ నేర్చుకొనమని ఉమాపతి బలవంతం చెయ్యటం నేను నేర్చుకోవటం జరిగాయి. అయితే ఉమాపతి చదువుతుంటే హాయిగా వినబుద్ధి పుట్టేది. మరి నా స్వరం-"పోనీ, రాగం లేకుండా ఊరికే పాఠం చదివినట్టు "చదువు" అని అతను సలహా ఇస్తే సంతోషంతో పాటించాను. కాని అతడు పాడుతున్నప్పుడు నాకు కలిగే భక్త్యావేశం, నేను అవే శ్లోకాలు చదువుతుంటే ఏ మాత్రమూ కలిగేదికాదు. కోపం వచ్చి చదవటం మానేసినా, ఆ మాట అతనితో చెప్పలేదు.

అయినా - నేను స్కూల్ ఫైనల్ పరీక్ష ప్యాసయినాను, ఉమాపతి తప్పాడు. "నిజం, ఉమాపతి తప్పాడు!" అని నన్ను నేను నమ్మించుకోటానకి ఎంతో శ్రమ పడ్డాను. పరీక్షా ఫలితాలు చూసిన మీదట ఉమాపతి ముఖాన నెత్తురు చుక్కలేదు. అతను తెలివితక్కువ వాడుకాడు, అయితే ఎక్కువ శ్రమపడి చదవక పోవచ్చు. అయినా తప్పవలసిన వాడుకాడు. కాని తప్పాడు. "ఎందుకు, ఎలా తప్పాడు?" అని ప్రశ్నించుకుంటే నాకు సమాధానం దొరకలేదు. అదృష్ట దేవత ఓర చూపు చూసింది. అంతే. ఆ తర్వాత మా యిద్దరి స్నేహానికి కొంత అడ్డు కలిగింది. నేను కాలేజిలో చేరటానికి గుంటూరు వెళ్ళి పోయాను. ఎప్పుడో సెలవులకి వచ్చినప్పుడు మాత్రం అతన్ని కలుసుకునే వాడిని. అదికూడా ఏ పార్కులోనో, బజార్లోనో యథాలాపంగా కనబడితేనే, ఇద్దరిమధ్యా యేదో చిన్న అఘాతం

ఏర్పడినట్టు అనుభూతి కలిగేది. అతనింటికి నేను మళ్లీ వెళ్ళలేదు. అతనూ పిలవలేదు.

ఆ మరుసటి సంవత్సరం ఉమాపతి పాసయ్యాడు. కాని అతను బందరు కాలేజిలో చేరి చదువు కొనసాగించాడు. అప్పుడప్పుడు అతనో, నేనో ఓ ఉత్తరం రాసి పడేసేవాళ్ళం. సమాధానం ఏ రెండు మూడు వారాలకో. సెలవుల్లో కలుసుకోటమూ తగ్గింది.

బి. ఏ. ఫయినల్ ఇయర్‌లో వుండగా అంతర్విశ్వ విద్యాలయ కళాశాలా నాటకోత్సవాలలో పాల్గోటానికి నేను బందరు వెళ్ళటం తటస్థించింది. ఉమాపతి రూమ్‌కి వెళ్ళాను. అప్పటికి అతన్ని చూసి ఓ సంవత్సరం అవుతుంది. మనిషి బాగా మారాడు. కండబలం స్ఫుటమై మనిషి రాటుదేలి క్రీడాకారుడిలా పరిణతి చెందాడు. గది నిండా పత్రికలు. అన్నీ స్పోర్ట్సుకి సంబంధించినవి. వ్యాయామ పరికరాలు. గదిలో ఓ మూల క్రికెట్ బాట్. టేబుల్ జేరవేసిన గోడకి ఓ పటం – ఆ పటాన్ని చూడగానే చప్పున నేను మొదట ఉమాపతి గదిలో చూసిన పటం జ్ఞప్తికి వచ్చింది.

"ఎవరిదా ఫొటో?"

ఉమాపతి పటంవైపు ఓ సారి చిరునవ్వుతో చూసి అన్నాడు.

"తెలియదా? రంజీ!"

"రంజీ ఎవరు"

"ప్రఖ్యాత భారతీయ క్రికెట్ యోధుడు."

"ఓ, మరి ఆపటం – ?" సందేహంగా అతనివైపు చూశాను.

"ఏ పటం?"

"అదే. శ్రీరామ పట్టాభిషేకం"

అతను నవ్వాడు. సమాధానం చెప్పకుండా ఒక నమస్కారం చేశాడు.

"ఏం, భక్తి తగ్గిందా?" అన్నాను.

"అదొక దశభాయ్." అని భుజంమీద చరిచాడు. నేను వెంటనే నమ్మ లేకపోయాను.

"దశ ఎప్పుడు మారింది?"

"స్కూలుఫైనలు తప్పినప్పుడే."

"అదేనా భక్తి?" అన్నాను అప్రయత్నంగా.

"ఆ గొడవ దేనికిలే, చూడు, ఇప్పుడు టైం నాలుగవుతోంది. క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌కి వెళ్ళాలి. ఈ సారి ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్స్‌కి మన యూనివర్శిటీ తరపున తప్పక సెలెక్టవుతానని అందరూ అంటు న్నారు. మరి నా బ్యాటింగ్ నైపుణ్యం నువ్వా చూద్దువుగాని. పద" అని బయల్దేర దీశాడు.

క్రికెటు ఆటలో ఉమాపతికి మంచి భవిష్యత్తుందని అతని ఫ్రండ్స్ చాలా మంది అభిప్రాయం వెలబుచ్చారు. నెట్స్‌లో అతని బ్యాటింగ్ చూసి నేనూ మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. శ్రద్ధగా ప్రాక్టీస్ చేస్తు న్నాడట.

గుంటూరు తిరిగి వెళ్ళిన కొద్దిరోజులకి ఉమాపతినుంచి ఉత్తరం వచ్చింది. క్రికెట్ ఆటలో అతనికి మంచి అభినివేశం వుందట. చదువుకీ, దానికీ పొత్తుకుదరటం లేదట. సలహా అడిగాడు. అభిరుచి ఉన్నదానినే అభి వృద్ధి చేసుకోటం మంచిదని రాశాను. తరువాత మా పరీక్షలయిపోయాయి. సెలవుల్లో కూడా ఆతను బందర్లోనే వున్నాడు. మేం కలుసుకోటం మళ్ళీ తర్వాత సంవత్సరం పరీక్షల ముందే, బి. ఏ. కాగానే నేను ఉద్యోగంలో చేరాను. వుద్యోగ వ్యవహారంలో రెండు రోజులు బందరులో మకాం వేయవలసి వచ్చింది. ఉమాపతిని కలుసుకుందామనే కొండంత ఆశతో అతని గదికి వెళ్ళాను.

గదిలో అడుగు పెట్టగానే ఒక్కసారి గుండె గతుక్కుమంది. ఉమాపతి రూం కాదని ఒక్క క్షణం అనుకున్నాను. కాని తేరిపారచూసి సందేహ

నివృత్తి చేసుకున్నాను. గడ్డం పెరిగి వుంది. కళ్ళు గుంటలుపడివున్నాయి. పూర్వం ఉన్న వ్యాయామ పరికరాలేమీ లేవు.

"ఏమిటీ వేషం ఉమాపతీ? జబ్బుపడి లేచావా? లేక పరీక్షలకి తెగ చదివేస్తున్నావా?" అన్నాను.

నన్ను చూడగానే, నా మాట వినగానే అతని కళ్ళల్లో వింతకాంతి వచ్చింది. ఆప్యాయంగా "ఎన్నాళ్ళకి కనిపించావోయ్!" అన్నాడు. కుశల ప్రశ్నలయాక నా ప్రశ్న మళ్ళీ అడిగాను,

"ఏమిటీ వేషం?"

అతను వెంటనే ఏమీ చెప్పకుండా, సిగరెట్ టిన్ తీసి ఓ సిగరెట్ నోట్లో పెట్టుకుంటూ కాలుస్తావా? అన్నాడు. ఆశ్చర్యపోయాను. అతనికీ అలవాటు పూర్వంలేదు. "వొద్దని తలూపుతూ "ఈ అలవాటు ఎప్పటినుంచి?" అన్నాను. అతను మందంగా నవ్వి తల పక్కకి తిప్పి గోడవైపుకి కనుబొమలెగరేసి "అప్పటి నించీ" అన్నాడు. గోడవైపు చూశాను. టేబిల్‌కి కొంచెం పైగా ఒక ఫొటోవుంది, దీక్షగా చూశాను.

"ఎవరు?"

"విద్యుల్లతా విగ్రహ, శతపత్రేక్షణ, చంచరీక చికోర, చంద్రాస్య, - ఒకానొక మరున్నారీ శిరోరత్నము."

అర్థమైంది. నా పెదవులమీద మందహాసం విరిసింది. అది చూసి "ఇదీ అవస్థ" అన్నాడతను ఏ వేవో వివరాలు చెప్పాడు. క్లాస్ మేటట. "ఘృతాచీ తిలోత్తమా హరిణీ హేమరంభా శశిరేఖ"ల్లో ఏ పేరైనా సరిపోతుందట. అంతవరకూ ఇంకా వన్‌వే ట్రాఫిక్కేనట. నాకు నవ్వొచ్చింది. టాపిక్ మార్చాలనే ఉద్దేశంతో గది నాలుగు వైపులా చూసి "నీ రంజీ ఫొటో ఏదీ?" అని అడిగాను.

ఏ మాత్రమూ ఆసక్తిలేని చూపు చూసి, శూన్యంలో చెయ్యి ఆడించాడు ఉమాపతి.

"నీ క్రికెటు బ్యాట్"

"పారేశాను."

ఆశ్చర్య పడ్డాను,

"పారేశావా ? ఎందుకు ?"

"పోదూ, వెధవ క్రికెట్. తప్పక సెలక్టవుతా ననుకున్నాను. లిస్ట్‌చూసి ఆశ్చర్యపోయాను. అదిగో, ఆదిబ్బల్లోకి విసిరేశా బ్యాట్" అని దూరంగా వేలు చూపించాడు. విస్మయంతో అలాగే అతని ముఖంలోకి చూస్తూ వుండిపోయాను.

ఉమాపతి బి. ఏ. ప్యాస్‌కాలేదని చెప్పటం అనవసరం. అతను ప్యాసవుతాడని నేనూ అనుకోనేలేదు. ఇంకెవరూ అనుకోలేదు. పరీక్షలు కాగానే బిచాణా ఎత్తేసి పల్లెటూరుకి ప్రయాణం కట్టాడట. రెండు సంవత్సరాల తర్వాత అతన్ని విచిత్రంగా కలుసుకున్నాను. ఈ లోపుగా అతను ఉత్తరం ముక్కయినా రాయలేదు.

మాకున్న నాలుగెకరాలు కౌలుకింద ఉంది. మక్తాకి తీసుకున్న ఆసామీ కౌలుదారీ చట్టం వచ్చినప్పటినుంచీ ఆసాకూ, ఈసాకూ చెప్పి బకాయి పెడుతూ ఇష్టమే రాజ్యంగా వున్నాడు. వుద్యోగం వెలగబెడుతున్నాను కదా అని మా పొలాలు వున్న ఊరువెళ్ళి కౌలుదారుతో వ్యవహారం చక్కబరచుకు రావలసిందిగా నాన్నగారి దగ్గరనించి ఆజ్ఞ జారీకావటం మూలాన ప్రయాణం కట్టాను. ఊరి పొలిమేరదాటి చెరువుకట్ట దగ్గరికి రాగానే లాండ్ స్కేప్ చిత్రం గీస్తున ఓ చిత్రకారుడిని చూసి సమీపంగా వెళ్ళాను. ఆ చిత్రకారుడు సాక్షాత్తూ ఉమాపతే అని పోల్చుకునే సరికి నోట మాట రాక అలాగే నిలబడి పోయాను. ఉమాపతీ ఇంచుమించు అలాగే స్తబ్ధుడై

పోయాడు. అతడే ముందు తేరుకుని ఆనందాతిరేకంతో కిందు మీదౌతో ఇంటికి లాక్కుపోయాడు.

ఉమాపతి ఇప్పుడు లాండ్‌స్కేప్ పెయింటర్! డ్రాయింగ్ క్లాసుల్లో బొమ్మలు బాగా వేస్తాడని మాష్టర్లు మెచ్చుకునే వాళ్ళేకాని చిత్రకారు డౌతాడని నేనెప్పుడూ ఊహించలేదు. ఈ జాగృతి ఎలా కలిగిందని అడిగాను.

"ఆ విద్యుల్లతా విగ్రహలేదూ –"

"ఆఁ ఆఁ...."

"ఆమెకి బొమ్మలంటే ఇష్టమని తెలిసిందోయ్. ఇంకేం బొమ్మలు గీయటం ప్రారంభించా. ఒకసారి కష్టపడి వాటర్ కలర్స్‌లో పోర్ట్రెయిట్ పెయింట్‌చేసి ఆమెకి చూపిస్తే "కళాకారుడి దృష్టిలో ఆది మానవుడు" అని టైటిల్ సజెస్ట్ చేసిందోయ్. ఇహ మనిషిబొమ్మ వేస్తే ఒట్టు. ప్రకృతి దృశ్యాల్ని చిత్రించటం ప్రారంభించాను. నిజంగా నాకిందులో టాలెంట్ ఉందోయ్. ఆ దృశ్యాలు చిత్రిస్తుంటే తన్మయుడినై పోతున్నాను. అబ్బ ప్రకృతి ఎంత అందమైనది. ప్రకృతిని ఆరాధిస్తూ, నా బొమ్మల్లో ప్రకృతి సుందరరూపాల్ని ఆవిష్కరిస్తూ జీవితం గడిపేస్తానోయ్. ఇహ జీవితంలో నాకేమీ వొద్దు."

ఆవేశంగా అన్నాడు ఉమాపతి.

"మరి ఆ శత పత్రేక్షణ....": అని నవ్వుతూ గదిలో టేబిల్‌కి పైగా గోడవైపు చూసి ఉలిక్కి పడ్డాను. అక్కడ ఓ లాండ్ స్కేప్ చిత్రం ఉంది, గదంతా కలయ చూశాను.

"ఏమిటి చూస్తున్నావు?"

అదే ఆ రంభా .... శశిరేఖా ఏవో .... అన్నావే –, ఫోటో ఏది ?"

ఉమాపతి చప్పరించాడు.

Shanti Printing Press
Mirzaguda, Secunderabad



"ఆ ప్రకృతి అందం తెలుసుకోక ముందులే అదంతా!"

"అయితే అతిలోత్తమ ఫోటో", ఆశ్చర్యంగా అతని ముఖంలోకిచూశాను.

శూన్యంలోకి చెయ్యి విసుర్తూ "ఏమూల పడ్డదో" అన్నాడు ఉమాపతి. ఈ నా స్నేహితుడిని గురించి నాకు కొంత దిగులు ప్రారంభమైంది. అతను కళాతపస్వి కావటం నాకు ఇష్టమే గాని, బొత్తిగా అందులో లీనమై బ్రహ్మచారి బ్రతుకు బ్రతుకుతాడంటే నాకు భయం వేసింది. "నామాట విని ఆమెను పెళ్ళిచేసుకో" అన్నాను.

"ప్చ్. ఆమెని మర్చిపోయి చాలాకాలమైంది" అన్నాడు. శతవిధాల చెప్పాను. ససేమిరా అన్నాడు. తను మంచి చిత్రకారుడు ఐనాడు కనక ఆమె అతన్ని తప్పక ప్రేమిస్తుందనీ, ప్రయత్నించమనీ బోధించాను. ఇష్టంలేదని మొండిపట్టు పట్టాడు. చేసేది లేక నేను వచ్చినపని ముగించు కుని తిరుగుప్రయాణం కట్టాను. "వచ్చే సంవత్సరం తప్పకవస్తే వ్యవ హారాన్ని నేను అనుకూలంగా పరిష్కారం చేయిస్తాను" అని హామీ ఇచ్చాడు. ఆసామితో ఏదో తాత్కాలికపు ఒడంబడిక చేసుకుని, తర్వాత వస్తానని చెప్పి తిరిగివచ్చేశాను.

కుప్పలువేసి, రమ్మని ఆసామీ కబురుపంపితే మొన్ననే మళ్ళీ అక్కడికి వెళ్ళివచ్చాను. ఉమాపతి గొప్ప కళాఖండాల్ని సృజించివుంటాడనీ, వాటిని చూసి అతనితో ఆనందం పంచుకోవాలనీ, కొండంత ఆశతో అతని ఇంటికి వుదయం వెళ్ళాను. ఇల్లు సమీపిస్తుంటే చక్కటి సంగీతం విని పించసాగింది. ఆశ్చర్యపడుతూ తలుపుతట్టాను. ఓరగావేసి వున్నట్టుంది. వెంటనే తలుపులు తెరుచుకున్నాయి. చాపమీదకూచుని ఉమాపతి రాగం తీస్తున్నాడు. నన్నుచూచి చప్పున లేచి ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. "ఎంత బాగా పాడగలవు ఉమాపతీ, ఎప్పుడో చిన్నప్పుడు విన్నాను. సాధకం చేసినట్టున్నావు బాగా" అన్నాను ప్రశంసాపూర్వకంగా.

నా ప్రశంసకి అతను పరవశుడైనాడు. "నిజంగా బాగాపాడగలనంటావా?" అన్నాడు. "నిజం నీస్వరం మధుర మధురం" అన్నాను. "ఏదో కృషి చేస్తున్నాను.'' అని నమ్రతగా అన్నాడతను.

"ఎప్పటినుంచి ?"

"కిందటిసారి నువ్వు వచ్చావు, చూడు. ఆతర్వాత ఓమాసం అవుతూం దేమో. బొమ్మలేసుకోటానికి ఊరిబయటికెళ్ళానోయ్. కుహూమని కోయల తియ్యగా ఒక సన్నాయి నొక్కు నొక్కితే హృదయం జల్లుమంది. దూరాన ఎద్దుల మువ్వల గంటలు గణగణమన్నాయి. తాళంవేసినట్లయింది. గొడ్లని కాచేవాడెవడో పిల్లనగ్రోవి ఊదాడు. మైమరచాను. ఆ సమ యంలో ఒక తియ్యని కంఠం మధుర మధురంగా గానం చేసిందోయ్. ఆ జానపద గానంలో ఎంత ఆకర్షణ. ఎవరో పల్లెపడుచు దేవుడిగుడిలో పాడిందోయ్. హృదయతంత్రులు మీటినట్టయింది. గానం మనుషుల్ని ఎలా కట్టిపడేస్తుంది. ఇహ ఆరోజునుంచీ కుంచెకి స్వస్తి.

వింటున్న వాడినల్లా ఒక్కసారి "ఆ!" అన్నాను. కుంచె మూలపడ్డది; టేబుల్ మీదుగా వున్న గోడవైపు చూశాను. లాండ్‌స్కేప్ చిత్రం బదులు స్టాండుమీద అమర్చిన టైంపీస్ వుంది. నీరవుడినయాను. "తెల్ల వారు ఝామున నాలుగింటికి అలారం పెట్టుకొని సాధన చేస్తున్నాను; ఈ ఊళ్ళో గాత్రంలో దిట్ట అయిన ఒక అయ్యవారున్నారులే. ఆయన దగ్గిర శిష్యరికం.'

ఉమాపతి ఏమిటో వుత్సాహంగా చెప్తున్నాడు. కాని నా వుత్సాహమంతా హరించిపోయింది. ఎలాగో పనిపూర్తిచేసుకుని తిరిగివచ్చాను.

ఉమాపతి సంగీతంలో పారం చూస్తాడని నే నెప్పుడూ అనుకోలేదు. నేను వచ్చిన కొద్దిరోజులకే నాకు వార్త తెలిసింది. ఉమాపతి, ఎవరో పల్లె పడుచుతో కలిసి మద్రాసు వెళ్ళాడట. ఏదో పిక్చరుతీసే ప్రయత్నంలో వున్నాడట. నేను విస్తుపోలేదు.

జరిగినంతవరకూ ఉమాపతి కథ ఇదీ. దీనికి క్లయిమాక్సు లేదనీ, ఇది ఇలా జరుగుతూనే వుంటుందనీ వేరే చెప్పనవసరం లేదు. ఎందుకంటే కుప్పించి ముందుకు పోవాలంటే, కొంతదూరం వెనక్కి పోవలసి రావచ్చని అతనికి అనుభవపూర్వకంగా తెలియదు. తెలుసుకునే తత్వం అతనికి లేదు.

అందుకే కాలెండర్ పేజీ చింపినప్పుడల్లా నాకు ఉమాపతి గుర్తుకొస్తూ ఉంటాడు.

(1964)

— o —